క్లుప్తంగా

ఆగమోక్తంగా గురుదక్షిణా మూర్తికి పూజలు



ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురు దక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

బడిఈడు పిల్లలకు అవగాహన



పిల్లలతో మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చిన్న పాలేడులో బడికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉన్న విద్యార్థులను ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులకు గురువారం ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్ట ప్రకారం బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలో ఉండాలని, బడి మాని ఇంటి వద్ద ఉండకూడదన్నారు. చదువుతోనే సమాజంలో గౌరవంతో పాటు ఉన్నత స్థానం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాల్లో గుట్కా విక్రయించడం నేరం

నాగలాపురం: పాఠశాల పరిసర ప్రాంతంలో సిగిరెట్లు, గుట్కాలు విక్రయించడం నేరమని ఎస్ఐ సునీల్ తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిధిలోని దుకాణాలను శిక్షణ ఎస్ఐ ప్రసాద్ తో కలిసి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఉన్న చోటు నుంచి 100 మీటర్ల పరిధిలోని దుకాణదారులు సిగిరేట్లు, గుట్కాలు విక్రయించడం నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వినాయకచవితి వేడుకలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: పండుగ వాతావరణంలో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. పట్టణంలోని వీఎంపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. వినాయక చవితి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకూడదన్నారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతున్న విద్యార్థిని ఢీకొన్న ఆటో



గాయపడిన విద్యార్థిని తీసుకెళుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పచ్చాలమ్మ కాలనీ వద్ద ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని పాండు రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొనడంతో గాయాలయ్యాయి. పాండుకు ప్రథమ చికిత్స అందించి శ్రీకాళహస్తిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేటీ రోడ్డునే ఆనుకుని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉండడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం కోసం రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో పాండును ఆటో ఢీకొంది. పాఠశాల వద్ద రోడ్డుపై స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల వద్ద రోడ్డుపై స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దివ్యాంగులపై నిర్దయ



కేవీబీపురం ఎండీఓకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు



దివ్యాంగుల పింఛన్ రద్దుపై వరదయ్యపాళెంలో నిరసన



వెరిఫికేషన్ కోసం దివ్యాంగుల పాట్లు (ఫైల్)

కూటమి కుట్రలకు దివ్యాంగులు బలైపోతున్నారు. పింఛన్లు పెంచి ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఏదో ఒక మెలిక పెట్టి పింఛన్లను అడ్డగోలుగా తొలగిస్తోంది. రీవెరిఫికేషన్ పేరుతో 80 నుంచి 90 శాతం వైకల్యం ఉన్నా కోత పెట్టి దివ్యాంగ పింఛన్ తీసుకునేందుకు అనర్హులంటూ లబ్ధిదారులకు నోటీసులు పంపుతోంది. ఇప్పటికే సత్యవేడు నియోజకవర్గంలో 1017 మంది దివ్యాంగ పింఛన్‌దారులకు అనర్హులంటూ నోటీసులు పంపించడంతో లబోదిబోమంటున్నారు.

- రీవెరిఫికేషన్ లోపభూయిష్టం
- పింఛన్ల రద్దు నోటీసులతో దివ్యాంగులు గగ్గోలు
- పెద్దఎత్తున నిరసనకు సిద్ధమవుతున్న వైనం

వరదయ్యపాళెం: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా మాట్లాడడం టీడీపీ అధినేత చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు అప్పటి వరకు ఉన్న రూ.3 వేల పింఛన్‌ను అధికారంలోకి రాగానే రూ. 6 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల పింఛన్‌ను పెంచినట్లే పెంచి లబ్ధిదారుల సంఖ్యలో కోతలు పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. దివ్యాంగులకు తిరిగి వైద్యులచే పరీక్షలు నిర్వహించేందుకు రీవెరిఫికేషన్ ప్రక్రియను గత ఏడాది డిసెంబర్ నుంచి ప్రారంభించారు. రీవెరిఫికేషన్ పేరిట చేపట్టిన ఆరోగ్య పరీక్షల్లో వేల మందిని అనర్హులుగా చేసే కుట్రకు తెర లేపారు.

బోదకాలతో ఇబ్బందులు



నేను బోదకాల సమస్యతో ఏ పని చేసుకోలేక అవస్థలు పడుతున్నా. వైద్యాధికారులు ధ్రువీకరణ మేరకు తనకు దివ్యాంగ పింఛన్ వచ్చేది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పింఛన్ ఆపివేస్తున్నట్లు నోటీసు అందించింది. బోదకాలు సమస్యతో బాధపడుతున్న నాకు దివ్యాంగ పింఛనే ఆధారం. అయితే పింఛన్ రద్దు చేస్తున్నట్లు నోటీసు ఇవ్వడం తనను తీవ్రంగా కలచి వేసింది. పింఛన్ ఆగిపోతే ఏ పని చేసుకోవాలో తెలియని పరిస్థితి.

– ఆర్. సుధాకర్, కేవీబీపురం మండలం

పింఛన్ తొలగించారు



ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోవడంతో ఆపరేషన్ చేయించుకున్నా. దీని కారణంగా ఏ పని చేయ లేకుండా కాళ్లు చచ్చుబడ్డాయి. దీంతో 2003లో తిరుపతిలో జరిగిన సదరన్ క్యాంపులో 80 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయడం జరిగింది. అప్పటి నుంచి పింఛన్ అందుకుంటున్నా. అయితే ఇటీవల జరిగిన సదరన్ క్యాంపులో తనకు 40 శాతమే వైకల్యం ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. వచ్చే నెల నుంచి పింఛన్ రాదని కార్యదర్శి నోటీసు అందజేశాడు. దీంతో మండల ఎంపీడీఓకు ఫిర్యాదు చేశాను.

–లోకేష్, సిద్ధాపురం, వరదయ్యపాళెం మండలం

85 శాతం వైకల్యం ఉన్నా..



వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరు గ్రామానికి చెందిన పి.రాజేష్‌కు పుట్టుకతో పోలియో బారీన పడి వైకల్యానికి గురయ్యాడు. దీంతో వైద్యాధికారులు సదరన్ క్యాంపు ద్వారా ఆ యువకుడికి 85 శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. దీంతో 16 సంవత్సరాలుగా ఆ యువకుడు దివ్యాంగ పింఛన్ అందుకుంటున్నాడు. ఆ యువకుడికి ఏకంగా 85 శాతం నుంచి 40 శాతమే ఉన్నట్లు ప్రస్తుతం వైద్యాధికారులు సదరన్ సర్టిఫికెట్ ఇవ్వడం గమనార్హం. దీంతో అక్టోబర్ 1 నుంచి అతడికి పింఛన్ రాదని సచివాలయ సిబ్బంది నోటీసులో పొందుపరిచారు.

–పి.రాజేష్, చిన్న పాండూరు, వరదయ్యపాళెం మండలం

పింఛన్ రద్దు చేశారు



నాకు 2018లో పక్షవాతానికి గురయ్యా. దీంతో అనారోగ్యం సమస్య నయం కాలేదు. బయటకు రావాలంటే వ్యక్తి సాయం అవసరం. గత ప్రభుత్వంలో రూ. 15 వేలు పింఛన్ వచ్చేది. కుటుంబానికి నేనే పెద్ద దిక్కు. పక్షవాతానికి గురవ్వడంతో కుటుంబం వీధిన పడింది. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మా కుటుంబానికి పింఛన్ ఎంతో ఆధారం. అయితే పింఛన్ రద్దు చేస్తున్నట్లు నోటీసు అందజేశారు.

–మనోహర్, గురుకులకండ్రిగ, కేవీబీపుం మండలం

సత్యవేడు నియోజకవర్గంలో పింఛన్ల రద్దు కోసం నోటీసులు అందుకున్న దివ్యాంగుల వివరాలు ఇలా..

మండలం	నోటీసులు అందుకున్న దివ్యాంగులు
బీఎన్‌కండ్రిగ	166
నారాయణవనం	254
పిచ్చాటూరు	62
సత్యవేడు	192
వరదయ్యపాళెం	79
నాగలాపురం	121
కేవీబీపురం	143

కంటి చూపు లేకున్నా కనికరించలే...



తనకు ఓ కన్ను పూర్తిగా చూపు కోల్పోయాను. దీంతో సదరన్ క్యాంపులో ఇచ్చిన ధ్రువ పత్రం ఆధారంగా 10 ఏళ్లకు పైగా దివ్యాంగ పింఛన్ అందుకుంటున్నా. ప్రస్తుత ప్రభుత్వం 3 నెలల క్రితం నాకు అందుతున్న పింఛన్ గురించి వెరిఫికేషన్ పేరుతో నోటీసు ఇవ్వడం జరిగింది. మరోమారు సదరన్ క్యాంపులో పరీక్షలు చేసుకోగా 40 శాతమే వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ చేశారు. దీంతో వచ్చే నెల నుంచి పింఛన్ ఆపేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు.

–తులసీ, ఎస్ఎస్‌పురం, నాగలాపురం మండలం

నాగలాపురం – టీపీ కోట రోడ్డు అభివృద్ధికి చర్యలు



ధ్వంసమైన నాగలాపురం–చిన్న పాండూరు రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ, ఎమ్మెల్యే

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని నాగలాపురం నుంచి టీపీ కోట మీదుగా చిన్న పాండూరుకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైన విషయంపై ఈనెల 18న సాక్షిలో గుంతలు బాబోయ్ అన్న కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఆర్ అండ్ బీ అధికార యంత్రాంగం స్పందించింది. గురువారం ఆర్ అండ్ బీ ఈఈ రాజా నాయక్, డీఈ అమరనాథరెడ్డితో కలిసి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ధ్వంసమైన నాగలాపురం–చిన్న పాండూరు రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. అధ్వాన్నంగా ఉన్న ఆ రోడ్డు మార్గంను చూసి వారు అవాక్కయ్యారు. నాగలాపురం నుంచి టీపీ కోట వరకు 19 కి.మీల మేరకు డబుల్ రోడ్డు అభివృద్ధి కోసం రూ. 71 కోట్ల నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలతో నివేదించారు. తక్షణమే నిధులు మంజూరయ్యేందుకు చొరవ చూపుతామని వారు వివరించినట్లు సమాచారం.

ఇంటికి తాళం.. కనిపిస్తే కన్నం

- పెరుగుతున్న చోరీలు

శ్రీకాళహస్తి: పట్టణంలో దొంగల ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. కొందరు ముఠాలుగా సంచరిస్తూ ఇంటికి ఎక్కడ తాళం పడిందా.. రాత్రికి ఆ ఇల్లు గుల్ల చేస్తున్నారు. అంతేకాదు పేదలు పెంచుకుంటున్న జీవాలను కూడా చోరీ చేస్తున్నారు. ఇటీవల పట్టణంలోని ఎస్‌డీకే నగర్‌లో ఓ వ్యక్తికి చెందిన రెండు గొర్రెలు ఇంటి ఆవరణలో కట్టేసి ఉంచాడు. రాత్రి వేళలో దొంగలు వాటిని అపహరించుకుపోయారు. దీంతో ఆ బాధితుడు లబోదిబోమంటున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి దక్షిణ కైలాస్‌నగర్‌లో ఓ ఇంటి వద్ద నిలిపి ఉంచిన ట్రాక్టర్ బ్యాటరీని చోరీ చేశారు. దీంతో ట్రాక్టర్ యజమాని గురువారం ఉదయం గుర్తించాడు. ఇలా శ్రీకాళహస్తి పట్టణలో పలు ప్రాంతాల్లో దొంగతనాలు ఎక్కువయ్యాయి. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పోలీసులు స్పందించి రాత్రిపూట గస్తీని పెంచి ప్రజలకు భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



మాజీ ఎమ్మెల్యే చెంచురెడ్డికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి

మాజీ ఎమ్మెల్యేకు నివాళి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి ఇటీవల మరణించారు. గురువారం ఆయన కర్మ క్రియలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధురెడ్డి, మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, జీవీకే విజయకుమార్, లక్ష్మీపతిరెడ్డి, మునిరత్నంరెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.

తొట్టంబేడు: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే తాటిపర్తి చెంచురెడ్డి ఇటీవల మరణించారు. సోమవారం ఆయన కర్మ క్రియలు జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు

రేణిగుంట: మండలంలోని మామండూరు–కుక్కలదొడ్డి హబీబ్ నగర్, మధ్య ఉన్న దర్గాలో ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దర్గా పెద్ద షేక్ అక్బర్ బాషా, మాజీ సర్పంచ్ షేక్ జహంగీర్ బాషా ఆధ్వర్యంలో భక్తులకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రజలు కులమతాలకు అతీతంగా దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఎంఏ జబ్బార్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ షేక్ ఫరీద్ బాబా, వివిధ పార్టీ నాయకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి అతిథులను సత్కరించారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడండి



తహసీల్దారుకు సీపీఎం నేతల వినతి

తొట్టంబేడు: మండలంలోని చేమూరు పంచాయతీ హరిజనవాడలో నివాసం ఉంటున్న మాదమాల వెంకటలక్ష్మికి 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ పంపిణీ భాగంగా చేమూరు రెవెన్యూ లెక్క దాఖలు సర్వే నంబర్ 308–డిలో ఒక ఎకరా 68 సెంట్ల విస్తీర్ణంతో ప్రభుత్వం భూమిని పంపిణీ చేసింది. ఆ పంపిణీ చేసిన భూమి మెట్ట భూమి కావడంతో ఉద్దులు, ఉలవలు పండించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే కొంత కాలంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన రవిరాజు అనే వ్యక్తి జేసీబీ సాయంతో ఆ భూమిలో ఉన్న చెట్లను తొలగిస్తూ దౌర్జన్యంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేశాడు. ఈ నేపథ్యంలో గురువారం సీపీఎం నేతలు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేశారు. ఆక్రమణదారుల నుంచి భూమిని కాపాడాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. భూమిలోకి ఎవరైనా అక్రమంగా చొరబడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్య మెరుగునకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. గురువారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని పురవీధుల్లో చెత్త సేకరణ, తడి–పొడి చెత్త, పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ తెలిపారు. స్వచ్ఛతతోనే వ్యాధులు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో యోగా గురువు సురేష్‌నాయుడు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కూలీల హాజరులో పారదర్శకత పాటించాలి



కూలీలతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలు నష్టపోకుండా ఎన్ఎంఎంఎస్ హాజరులో పారదర్శకత పాటించాలని పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. గురువారం తిమ్మభూపాలపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పథకంలో మినీ గోకులాలను పశువులు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని అర్హతలను పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. మండలంలో 6 వేల మంది కూలీలు పనిచేయాల్సి ఉండగా 3,200 మంది కూలీలు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. కూలీల సంఖ్యను పెంచకపోతే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కూలీలు నాలుగు గంటల పాటు పనిచేస్తే రూ. 300 కూలీ వస్తుందని, ప్రతి గ్రామ పంచాయతీలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి, వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని అంగన్‌వాడీల ఆందోళన



మానవహారంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘం నేతలు

రేణిగుంట: మండలంలోని అంగన్‌వాడి కార్యకర్తలు, సహాయకులు గురువారం స్థానిక గాంధీ విగ్రహం ముందు మానవ హారం నిర్వహించి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి ధనమ్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని అందువల్లే ఈ రోజు బ్లాక్ డేగా పాటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటరమణ, సెక్టార్ లీడర్ అంబిక, ప్రభ, విమల, ఐద్వా నాయకురాలు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెల్‌ఫోన్లకు 5 జీ నెట్ ఇవ్వాలని, ప్రధాన మంత్రి మాతృ వందనం పథకాన్ని అప్పగించవద్దని, మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, సుదర్శన, కృష్ణవేణి, సుపర్ణ, మంజుల, శ్యామల పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మహిళలకు చేతివృత్తులతో భరోసా



సామగ్రిని అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

శ్రీకాళహస్తి: మహిళల ఆర్థిక ఎదుగుదలకు చేతివృత్తులే భరోసా అని జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మోహన్ అన్నారు. పట్టణంలోని పానగల్‌లోని రాస్ మహిళా వాణి కేంద్రంలో గురువారం రాస్–జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ కోర్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మోహన్ మాట్లాడుతూ.. జేఎస్ఎస్ ద్వారా ఏటా 90 బ్యాచులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగానే ఈ ఉచిత బ్యూటీషియన్ కోర్సును ప్రారంభించినట్లు తెలిపారు. పూర్తి కోర్సులను నేర్చుకున్న వారికి బ్యాంకుల ద్వారా అనుసంధానం చేసి ఆర్థికంగా స్థిరపడటానికి అవకాశం కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనశిక్షణా సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, మీనా, రాస్ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, వినోద్, ముఖేష్, మీనా, రాజశేఖర్, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల నిరసన



నిరసనలో పాల్గొన్న రైల్వే కార్మికులు

రేణిగుంట: తిరుపతి రైల్వే గ్యారేజ్ రిపేర్ షాప్ ప్రధాన గేటు ఎదుట గురువారం కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రతి నెలా ఇస్తున్న 50 శాతం ఇన్సెంటివ్‌ను తగ్గించాలనే కుట్రను కార్మిక సంఘాలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రిపేర్ షాప్‌లో ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని , కార్మికులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బాబు మాట్లాడుతూ.. రైల్వే గ్యారేజ్ రిపేర్ షాప్‌లో యాజమాన్యం కార్మికుల కడుపు కొట్టే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. రైల్వే ఎంప్లాయ్ సంఘ్ చైర్మన్ మునయ్య మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘాలు సంఘటితంగా ఉద్యమిస్తేనే న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే కార్మిక సంఘాల జేఏసీ ముఖ్య నాయకులు సదా శివరెడ్డి, వెంకటరమణ, సతీష్, ఉదయ్ రత్నం, గంగన్న, శేషప్ప, పద్మనాభరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.